ప్రజాశక్తి
ఆదివారం 2 నవంబర్ 2025 5 అనంతపురం





ఎన్టీఆర్ సామాజిక భద్ర పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉరవకొండ మండలం అమిద్యాల గ్రామంలో వృద్ధురాలికి నగదు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...

సంక్షేమంతో పాటు రాష్ట్ర పునర్‌నిర్మాణ పాలన చేస్తున్నాం

పెద్దన్నవారిపల్లి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కదిరి నియోజకవర్గానికి వరాల జల్లు



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కదిరి టౌన్, తలుపుల, కదిరి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'పేదల సేవలో' భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పర్యటించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులను స్వయంగా కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. రెడ్డెమ్మకు వితంతు, హార్మోనిస్టు మల్లయ్యకు కళాకారుల పింఛను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగులమ్మను పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మాట్లాడారు. పేదల ఆర్థిక సంక్షేమానికి తోడ్పాటునిస్తూ సామాజిక పింఛన్లను ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారుల తలుపుతట్టి అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లా ప్రజలనూ కలుసుకోవాలన్న ఉద్దేశంతో ప్రతి నెలా ప్రజల వద్దకు వస్తున్నామని అన్నారు. మొంథా తుపానును సాంకేతిక సాయంతో ముందస్తుగా గుర్తించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. అందువల్లే నష్ట తీవ్రత తగ్గిందన్నారు. తుపాను వల్ల రూ.5,244 కోట్ల ఆస్తి నష్టం రాష్ట్రంలో జరిగిందని, ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటికే తుపాన్ నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేదికలు అందజేశామని చెప్పారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పి4 విధానం అమలు చేస్తున్నామని అందులో భాగంగా ప్రభుత్వం సర్వే ద్వారా పేదలను గుర్తించి వారికి ప్రభుత్వం తరపున ఆర్థికంగా సామాజికంగా భరోసా కల్పించడంతోపాటు ఆదాయం పెంచేలా కృషి చేస్తున్నామని చెప్పారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు రాబోయేది ఐటీ విప్లవని ముందే చెప్పానని చెప్పిన మాట ప్రకారం లక్ష్యాన్ని చేరుకోగలిగామని ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో ఎక్కడ చూసినా తెలుగువారు ఐటీ కంపెనీల్లో స్థిరపడ్డారని అన్నారు. వైసిపి ఏదో రకంగా రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నూతన టెక్నాలజీ ద్వారా అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకుంటున్నామనిగతంలో లాగా వైసిపి నేతల ఆగడాలు సాగవని నూతన టెక్నాలజీ ద్వారా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావేదిక కార్యక్రమం ప్రారంభంలో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఘటనలో 9 మంది మృతికి సంతాప సూచకంగా సిఎంతో పాటు, నాయకులు, ప్రజలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కదిరికి వరాల జల్లు : కదిరి ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరాలజల్లు కురిపించారు. కదిరి పట్టణంలో అడిషనల్ జిల్లా కోర్టు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థాన మాడవీధులను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఏడు కోట్ల రూపాయలతో మైనార్టీ ప్రెసిడెంట్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం ఏడు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని సిఎం ప్రకటించారు.

కదిరి పరువు తీసిన జగన్ : ఎమ్మెల్యే కందికుంట

ప్రజావేదికలో కదిరి ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలకు దిగారు. జగన్మోహన్ రెడ్డి కదిరి నియోజకవర్గ ప్రజల పరువును మంటలో కలిపారన్నారు. జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్యకేసులో కదిరి నుంచి గొడ్డలి తీసుకెళ్లి కదిరి సార్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మాట అనగానే సభా సమావేశంలో భారీ ఎత్తున ప్రజలు కేరింతలు వేశారు. పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమానికి అధ్యక్ష వహించిన కదిరి పరువు తీశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు కదిరి అభివృద్ధికి ఎంతో చేయూతను అందజేస్తున్నారని అందుకు నియోజవర్గ ప్రజలు, తాము ఎంతో రుణపడి ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో కదిరి నియోజకవర్గం ఆధ్యాత్మిక టూరిజంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆర్థికంగా మెరుగుపరిచే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కదిరి అభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభ్యర్థించిన అంశాలన్నిటిని పరిశీలించి పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం :

తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ లో భాగంగా శనివారం మధ్యాహ్నం 12.47 గంటలకు పెద్దన్నవారిపల్లె హెలిపాడ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి హెలీప్యాడ్ వద్ద కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ, జిల్లా మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగాకలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసి మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు వివిఎస్ శర్మ, సువర్ణ ఆనంద కుమార్, మహేష్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కదిరి, మడకశిర మాజీ ఎమ్మెల్యేలు పార్థసారథి, ఈరన్న, కూటమి నాయకులు భైరవప్రసాద్, వంశీ, అంజనప్ప నియోజకవర్గ టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సిఎం పర్యటనా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,ఆర్టీసీ ఛైర్మన్ నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





రెడ్డమ్మకు వితంతు పింఛను అందజేస్తున్న సిఎం



వృద్ధురాలితో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



ప్రజావేదికలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

'శ్రీరామిరెడ్డి' కాంట్రాక్టర్‌పై

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

వేతనాల తగ్గింపు, కార్మికుల తొలగింపుపై పోరాటం ఆగదు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, నాయకులు

శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న అడపాల వెంకట్రావుపై క్రిమి నల్ కేసులు నమోదు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ కింద పని చేస్తున్న సూపర్‌వైజర్ కిరణ్, గౌతమ్‌పై కూడా కేసులు పెట్టాలన్నారు. కార్మికుల పట్ల కాంట్రాక్టర్ వైఖరిని ఖండిస్తూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓబులు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ తన సన్నిహితుడైన ప్రకాశం జిల్లాకు చెందిన అడపాల వెంకట్రావుకు కాంట్రాక్టు ఇప్పించారని ఆరోపించారు. అతడు కార్మికులను వేధించడంతో పాటు వేతనాలు తగ్గించి ఇష్టముంటే పనిచేయండి లేదంటే తప్పుకోండని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీబాండ్‌పై బలవంతంగా సంతకాలు చేయించుకోవడం, అందుకు సహకరించని వారిని ఉద్యోగం నుంచి మానుకోండని కిరణ్, గౌతమ్ బెదిరించడంపై మండిపడ్డారు. 17 ఏళ్లకు పైగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికులపై దుర్మార్గపు పనులకు ఒడిగట్టడాన్ని సహించమని హెచ్చరించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజకు విషయం తెలుపగా తెలియదంటున్నారని పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీతో చర్చించి కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, సిఐటియు డివిజన్ కార్యదర్శి రంగనాథ్, తాగునీటి కార్మికులు ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, బాషా, తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలపై పోరాడుదాం

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కలిసికట్టుగా పోరాడుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడుతో కలిసి మహాసభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించే పంటకు గిట్టుబాటుధర కల్పించకుండా అన్యాయం చేస్తున్నాయని అవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం, కంబదూరు, కనేకల్లు, బెళుగుప్ప మండలాల్లో సోలార్ ప్రాజెక్టు పేరుతో రైతుల భూములను లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ వ్యవస్థలకు ప్రభుత్వాలు వ్యవసాయ భూములను కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వాటిని రైతు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిత్తప్ప, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కమిటీ సభ్యులుగా మారెన్న, వన్నూరుస్వామి, అల్లబకాష్, తిప్పయ్య, అనిల్, ఎర్రిస్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగనాథ్, రైతులు పాల్గొన్నారు.

నీటి కాలువలో పడి విద్యార్థి మృతి



మృతిచెందిన పృథ్వీరాజ్

పెద్దవడుగూరు : మండలంలోని బుర్నాకుంటకు చెందిన పృథ్వీరాజ్(15) శనివారం ప్రమాదవశాత్తూ యాడికి కాలువలో పడి మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. భీమలింగ, శశికళ దంపతులకు ఓ కుమార్తె, ఓ కుమారుడు సంతానం. చిన్న వాడైన పృథ్వీరాజ్ లక్షుంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బంధువుల వివాహం నిమిత్తం రెండు రోజులుగా పృథ్వీరాజ్ పాఠశాలకు వెళ్లలేదు. తన తల్లి శనివారం పొలంలో పని చేస్తుండగా భోజనం తీసుకెళ్తున్న సమయంలో యాడికి కాలువపై ఉన్న వంతెన దాటే క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి బాలుడిని బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏడాది క్రితమే తండ్రి భీమలింగ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం కుమారుడు మృతి చెందడంతో తల్లి, కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

'అమరజీవి'కి ఎమ్మెల్యే నివాళి



అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

అనంతపురం : అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాన్ని రాష్ట్రం ఎప్పటికీ మరువలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్, చంద్రబాబు ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, రాజీవ్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్ యాదవ్, మోహన్‌కుమార్, రాజారావు, కృష్ణం, రఘు, నారాయణస్వామి, గోపాల్, సికిందర్ పాల్గొన్నారు.

కుష్టుపై అపోహలు తొలగించాలి : కలెక్టర్



కుష్టు వ్యాధి నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వైద్యాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

కుష్టు వ్యాధిపై ప్రజల్లో అపోహలు తొలగించడంతో పాటు వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై శనివారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ భవన్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయం అవుతుందన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తికీ కుష్టు వ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని తెలియజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీ అధికారి నందకిషోర్, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి జిల్లా అధికారి డా. బి.జయలక్ష్మి, డిఎన్ఎంఒ డా. కె.గంగాధర్‌రెడ్డి, డా. శివారెడ్డి, పిఎంఒ ఎ.నాగన్న, డిపిఎంఒ రామదాసు, పిటి. రాముడు, డెమో త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు మరింత చేరువకావాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ.ఆనంద్ సూచించారు. నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం భారతీయ రెడ్ క్రాస్ సమాఖ్య కార్యకలాపాలపై సమీక్షించారు. రక్తదాతలు, బాధితులకు ఉపయోగకరంగా మారిన కొత్త రక్తం ప్రాసెసింగ్ ఛార్జీలను ఆమోదించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ నిర్వహించాలని, తద్వారా కార్మిక భద్రత మెరుగుపడే అవకాశం ఉంటుంద న్నారు. కేంద్రాల్లో సరిపడా రక్త నిల్వలు ఉంచాలన్నారు. కార్నియా అంధత్వ నివారణలో భాగంగా ప్రస్తుతం ఉన్న కార్నియా కలెక్షన్ సెంటర్ ను పూర్తి కంటి బ్యాంక్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు సిఎస్ఆర్ ద్వారా నిధులు సమకూర్చు కోవటానికి సహకరిస్తానని తెలిపారు. ప్రాణాంతక జన్యు సంబంధిత జబ్బుల (తలసేమియా) రోగులకు ప్రత్యేక ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ ఏర్పాటుపై కూడా చర్చించి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజల భద్రత కోసం బ్రీత్ అనలైజర్స్ సమకూర్చేందుకు విరాళాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, స్టేట్ ఎంసి సభ్యులు కాపు రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.లక్ష్మణప్రసాద్, సెక్రటరీ మోహన్‌కృష్ణ, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అటవీ భూముల మట్టితో రైల్వే పనులు

పట్టించుకోని రెవెన్యూ, అటవీ, గనుల శాఖ అధికారులు

అనుమతులున్నాయంటూ బుకాయింపు

అమిగోస్ సిబ్బంది చేతివాటం



మట్టికోసం రైల్వే ట్రాక్‌పక్కనే తీసిన గుంత

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల పరిధిలోని పల్లెపల్లి సమీపం నుండి చదం గేట్, కుంటు మారెమ్మ ఆలయం సమీపం (బొందనకల్లు ఫారెస్ట్) వరకు రైల్వే ట్రాక్ పనులు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బళ్లారి - రాయదుర్గం రైల్వే లైన్ పనుల్లో భాగంగా విభాగాల వారీగా రైల్వే ట్రాక్‌ను పటిష్ట పరిచే పనులు జరుగుతున్నాయి. ట్రాక్ ఇరువైపులా గరుసు మట్టిని కప్పి పటిష్ట పరుస్తున్నారు. ఈ పనులను ప్రధాన గుత్తేదారు సోమలాపురానికి చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు. పల్లెపల్లి గేట్ సమీపం నుండి గరసు మట్టిని టిప్పర్లలో రైల్వే ట్రాక్ పనులకు తరలించారు. చదం గేట్ సమీపంలో ఓ తోటలో కొంతమేర మట్టిని కొనుగోలు చేసి ఉపయోగించారు. ఓ టన్ను మట్టికి 87 రూపాయలు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుందని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఓ టిప్పర్‌కు 20 టన్నుల మట్టిని నింపుతారు. ఈ లెక్కన ఓ టిప్పర్‌కు టన్ను 87 రూపాయలు ప్రకారం ఇరవై టన్నులకు 1740 రూపాయలు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా మట్టిని తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ లెక్కన అనుమతులు లేకుండా మట్టిని తరలించడంతో భారీ మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. దీనికి తోడు ఏకంగా అటవీ భూముల నుండి మట్టిని తరలించడం చూస్తుంటే మట్టి మాఫియా బరితెగించినట్లు కనబడుతోంది. అయితే మట్టి తరలింపునకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తూనే వివిధ శాఖలకు మామూళ్లు చేర్చినట్లు చెప్పుకుంటున్న వ్యక్తి చేస్తున్న ఇలాంటి పనులకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం, పనులను ఆపకపోవడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోంది. రాయదుర్గం - బళ్లారి ప్రధాన రహదారిపై కుంటు మారెమ్మ ఆలయం మల్లాపురం గేట్‌కు సమీపంలో ఉంటుంది. ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంతమంతా బొందనకల్లు ఫారెస్ట్‌కు చెందినది. రైల్వే ట్రాక్ చదం గేటు సమీపం దాకా మినహాయించి అటు పల్లేపల్లి గేట్, ఇటు బొందనకల్లు ఫారెస్ట్ గుండా వెళ్లే రైల్వే ట్రాక్ చాలా ఎత్తులో ఉంటుంది. రైల్వే ట్రాక్ కు తూర్పు భాగంలో ఉన్న అటవీ ప్రాంతం ప్రధాన రహదారిపై వెళ్లేవారికి కనిపించినంత ఎత్తులో ఉంటుంది. రాయదుర్గం - బళ్ళారి ప్రధాన రహదారికి ఆనుకుని కొంతమేర రైల్వే ట్రాక్ ఉంటుంది. ఇదే అదునుగా సోమలాపురానికి చెందిన వ్యక్తి అటవీ ప్రాంతంలో భారీగా తవ్వకాలు చేపట్టాడు. హిటాచితో గుంతలు ఏర్పాటు చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనబడుతున్నాయి. రైల్వే ట్రాక్ తూర్పు భాగంలో అటవీ ప్రాంతంలోని మట్టితో పటిష్టం చేసినట్లు కనబడుతోంది. తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో వర్షపు నీరు చేరాయి. ట్రాక్‌కు సమీపంలో తవ్విన గుంతలను కనబడకుండా అడవిలో ఉండే కంప తో కప్పేశారు. సుమారు 700 టిప్పర్లకు పైగా రైల్వే ట్రాక్ పనులకు మట్టి తరలించినట్లు పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, గనులు, అటవీశాఖకు చెందిన అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమిగోస్ సంస్థ ఆధ్వర్యంలో క్రషర్ల సమీపంలో రాయల్టీ వసూలు, పర్మిట్ల పరిశీలన కోసం చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. కుంటు మారెమ్మ ఆలయం వద్ద అమిగోస్ సంస్థ ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ ఇప్పటికీ ఉంది. మట్టి తరలింపునకు సంబంధించి అమిగోస్ సంస్థకు సంబంధం లేకపోయినప్పటికీ కొంతమంది పరపతి కలిగిన ఉద్యోగులు టిప్పర్‌కు ఇంత ఇవ్వాల్సిందేనని, లేకపోతే మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పి వసూలు చేసుకున్నట్లు సమాచారం. రాత్రి సమయాల్లో హిటాచితో తవ్వి టిప్పర్లలో మట్టి తరలిస్తున్నప్పటికీ అమిగోస్ చెక్ పోస్ట్‌లో పనిచేసే సిబ్బంది ఉన్నత అధికారుల ఆదేశాలతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. సందట్లో సడేమియా అన్నట్లు అమీగోస్‌కు చెందిన కొంతమంది ఉద్యోగులు ఓ టిప్పర్ మట్టి తరలింపుకు 800 రూపాయలు చొప్పున బేరం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై రాయదుర్గం తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. అమిగోస్ జిల్లా హెడ్‌మ్యాడికు వివరణ కోరగా డబ్బు వసూలు ఆరోపణలో వాస్తవం లేదన్నారు. ఇది తమ పరిధిలోకి రాదన్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



రైల్వే ట్రాక్ ఏర్పాటుకు మట్టికోసం అటవీభూముల్లో తీసిన గుంతలో నిలిచిన వర్షపునీరు



మట్టికోసం తీసిన గుంత కన్పించకుండా ముళ్లకంప వేసిన దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

ఉరవకొండ మండల అభివృద్ధిపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఉరవకొండ మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమా లపై శనివారం మంత్రి కౌకుంట్లలోని తన నివాసంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధుల వినియోగం, అమలవుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనితీరు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు మంజూరైన నిధుల వివరాలపై ఆరా తీశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, ఉరవకొండ పట్టణంలో నూతన కాయగూరల మార్కెట్ ఏర్పాటు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకొని అవసరమైన మేరకు ప్రతిపాదన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఉరవకొండలో పాతబడిన భవనాలు, మండల స్థాయిలో ఉన్న వాటిని పరిశీలించి నూతన కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. చాలామంది పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని అర్హులకు స్థలాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ రవిప్రసాద్, పిఆర్ డిఇ రుహుల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, డిప్యూటీ ఎంపిడిఒ సతీష్, పంచాయతీ సెక్రటరీ గౌస్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు, సభ్యులు

రాత్రివేళల్లోనూ గైనకాలజిస్ట్ సేవలందించాలి : ఐద్వా

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల సంఖ్యను పెంచి రాత్రి సమయంలో గైనకాలజిస్ట్ డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ డాక్టర్ జయదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ ఆసుపత్రికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి పేదలు వైద్యం కోసం వస్తుంటారన్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రసవం కోసం వేళ కాని వేళలో వస్తుంటారన్నారు. ఈ సమయంలో సీనియర్ సిస్టర్, హెడ్ నర్సులు మాత్రమే ఉంటారన్నారు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి విషమించినప్పుడు అనుభవజ్ఞులైన డాక్టర్లు లేకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తుంటారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాపాయం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ఇందుకు రెండు రోజుల క్రితం జరిగిన ఘటనే సాక్ష్యం అన్నారు. ఆ సమయంలో సరైన వైద్యనిపుణులు ఉండి ఉంటే ఆ సంఘటన జరిగి ఉండేది కాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రాత్రి వేళ ప్రసూతి వైద్య నిపుణులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, షకీలా, సరస్వతి, ప్రభావతి, పూర్ణిమ, జ్యోతి, రాణి, సరోజ, గిరిజమ్మ, సాయి, సుంకమ్మ, మారెక్క, తదితరులు పాల్గొన్నారు.



అరుణాచల గ్యారేజ్ సర్వీసెస్ సెంటర్, (ఇన్‌సెట్‌లో నిర్వాహకులు ప్రసాద్)

నేడు 'అరుణాచల గ్యారేజ్ సర్వీసెస్' ప్రారంభం

హాజరుకానున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేట సమీపంలో జొన్న ఐరన్ మార్ట్ పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన అరుణాచల గ్యారేజ్ సర్వీసెస్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు మై టీవీఎస్ ఫ్రాంచైజ్ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్ సెగ్మెంట్‌లో అన్ని రకాల ఫోర్ వీలర్ సర్వీస్ స్పేర్ పార్ట్స్, టింకరింగ్, పెయింటింగ్, మల్టీ సర్వీసెస్ ఒకే చోట లభించేలా 'మై టీవీఎస్ ఫ్రాంచైజ్ షోరూం' ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ షోరూమ్‌ను మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు, హాజరవుతారని తెలిపారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-రాయదుర్గం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని 74-ఉడేగోళం గ్రామంలో శ్రమదానం చేశారు. వారు స్థానిక అనంతపురం రోడ్డు, విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేశారు. వార్డుల్లో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచి దుర్గమ్మ, నాయకులు జెకె. జయన్న, అధ్యాపకులు డి.శ్రీనివాసులు, కె.వీరేష్, సుబ్రహ్మణ్యంస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.ఓబులేష్, పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంటర్ కాలేజ్ మీట్(గ్రూప్-ఏ) టోర్నమెంట్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో వివిధ కాలేజీల నుంచి అనేక జట్లు పాల్గొన్నాయి. ఆర్ట్స్ కాలేజీ క్రీడాకారులు వాలీబాల్, బాల్ బాడ్మింటన్, చెస్‌లో ప్రతిభ చాటారు. సాఫ్ట్ బాల్‌లో ఎస్ఎస్‌బిఎన్ కళాశాల జట్టు, టేబుల్ టెన్నిస్‌లో కదిరిలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కళాశాల జట్లు విజయం సాధించాయి. అలాగే వాలీబాల్‌లో ఎస్‌వి డిగ్రీ, పిజి కాలేజీ జట్టు, బాల్ బాడ్మింటన్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు, చెస్‌లో ఎస్కెయు జట్టు, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ బాల్‌లో ఆర్ట్స్ కాలేజీ జట్లు రన్నర్స్‌గా నిలిచాయి. విజేత జట్లకు విశ్వవిద్యాలయ క్రీడా విభాగాధికారి డా. బి.జెస్సీ, ఎస్కెయు కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్‌వి.ప్రసాద్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.శ్రీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులునాయక్, అధ్యాపకులు, ఎస్కెయు పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల క్రీడాకారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేత జట్లకు ట్రోఫీ అందజేస్తున్న విశ్వవిద్యాలయ క్రీడా విభాగాధికారి డా. బి.జెస్సీ

అసంపూర్తిగా జాతీయ రహదారి నిర్మాణ పనులు

అయినా టోల్‌గేట్ పన్ను వసూలు

ప్రజాశక్తి - రాయదుర్గం

అనంతపురం నుండి కళ్యాణదుర్గం రాయదుర్గం మీదుగా కర్నాటక రాష్ట్రంలోని హానగల్ వరకు జాతీయ రహదారి 544 డిడి నిర్మాణం చేపట్టబడింది. అనంతపురం నుండి కళ్యాణదుర్గం వరకు రహదారి పనులు పూర్తికాగా ఒడ్డుపల్లి వద్ద టోల్‌గేట్ ఇదివరకే ఏర్పాటు చేశారు. అయితే రాయదుర్గం పట్టణ సమీపంలో జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ రాయదుర్గం మండలం కదరంపల్లి వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. పట్టణ పోలిమేరలో రైల్వే లైన్ మీద జాతీయ రహదారి వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. రాజీవ్ గాంధీ కాలనీ, గ్యాస్ గోదాము వద్ద జాతీయ రహదారి పని అసంపూర్తిగా ఉంది. అక్కడ స్థానికులు ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు జె ఆర్ ఎస్ కాలనీ వద్ద ఉన్న జాతీయ రహదారి అండర్ బ్రిడ్జి వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. రైల్వే లైన్ మీద వంతెన నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ ముందుగా రైల్వే అధికారుల వద్ద అనుమతి తీసుకోకపోవడం వల్ల వంతెన సిద్ధం చేసినప్పటికీ దానిని జాతీయ రహదారిపై రైలు మార్గాల వద్ద బ్రిడ్జి బిగించేందుకు రైల్వే శాఖ అనుమతి లభించలేదు. పనులు పూర్తి కాకపోయినప్పటికీ జాతీయ రహదారుల సంస్థ కదరంపల్లి వద్ద ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజా వద్ద పన్ను వసూలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో బుధవారం నుండి టోల్‌గేట్ వద్ద పన్ను వసూలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం జాతీయ రహదారి వంతెన పూర్తి కాకపోవడంతో భారీ రవాణా వాహనాలు రాయదుర్గం పట్టణం ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో రవాణా వాహనాలు గతంలో ఉన్న బైపాస్ రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద బురద రాళ్ల గుంతల్లో ఇరుక్కుని అక్కడి నుండి బయటపడడానికి జెసిబి, క్రేన్ల సాయంతో పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అందువల్ల భారీ రవాణా వాహనాలు ఇప్పటికీ రాయదుర్గం పట్టణ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం పనులు పూర్తికాకుండానే టోల్‌గేట్ పన్ను ఎలా వసూలు చేస్తారని వాహనదారులు జాతీయ రహదారి పన్ను వసూలు దారులను నిలదీస్తున్నారు. అయితే ఇందుకు సరైన సమాధానం ఇవ్వక నామమాత్రంగా పన్ను వసూలు చేస్తున్నట్లు అధికారులు వివరణ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుకు టోల్‌గేట్ రుసుము 150



గ్యాస్ గోదాము వద్ద అసంపూర్తిగా ఉన్న హైవే పనులు

రూపాయలు వసూలు చేస్తుండగా ఆర్టీసీ మాత్రం ఒక్కో ప్రయాణికుని నుండి ఐదు రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా టికెట్ పై పది రూపాయలు అదనంగా వసూలు చేస్తోంది. ఇదెక్కడి న్యాయమని ప్రయాణికులు వాపోతున్నారు. జాతీయ రహదారి దిగువన వంతెన తక్కువ కొలతలతో ఏర్పాటు చేయడం వల్ల కురాకుల గుట్ట వద్ద దుగ్గిలమ్మ గుడి వెనకవైపు నుండి వచ్చే వర్షపు నీటి మరియు మురికి నీటి కాలువ నీరు చిన్నగా ఉన్న వంతెనగుండా ముందుకు వెళ్లక జాతీయ రహదారి పక్కనే గల సర్వీస్ రోడ్డుపై సుమారు ఐదు అడుగుల మేరకు నిల్వ ఉంటుంది. అధిక వర్షాలు కురిసిన ప్రతిసారి దుగ్గిలమ్మ గుడి, మధు టాకీస్, రాజీవ్ గాంధీ కాలనీలు వాన నీటి ముంపునకు గురి అవుతాయి. జాతీయ రహదారి దిగువన వర్షపు నీరు మరియు మురికి నీరు ముందుకు వెళ్లేందుకు అవసరమైనంత వెడల్పు వంతెన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి వంతెన, సర్వీస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని,74-ఉడేగోళం వద్ద జాతీయ రహదారి నుండి బళ్లారి రోడ్డు వరకు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రాయదుర్గం అభివృద్ధే లక్ష్యం : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కాలవ శనివారం పట్టణంలో రెండు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అందులో ఓబుళాచారి రోడ్డు నుంచి స్థానిక ప్రభుత్వాసుపత్రి వరకూ రూ. 25 లక్షలతో చేపట్టిన సీసీ రహదారి, వెంకటేశ్వర కాలనీలో రూ. 24.9 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు సురేష్, నరసింహులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, వైస్ ఛైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, ప్రశాంతి, సాబిరాబి, శారద, పద్మజ, గోవిందరాజులు, మహబూబ్‌బాషా, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుని సిఫారసు లేఖపై కాలవ వివరణ

డి.హీరేహాల్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు అనంతశయన గతంలో సస్పెండ్‌కు గురయ్యారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదైందన్నారు. ఆ తర్వాత భార్యాభర్తలు రాజీ కాగా కోర్టులో కేసు కొట్టి వేశారన్నారు. దీంతో స్థానికులు, అనంతశయన దంపతుల వినతి మేరకు వాస్తవాలు తేల్చి తగిన నిర్ణయం తీసుకోమని దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసిన విషయం వాస్తవమే అన్నారు. అయితే అతని నైతికతపై లేఖ ఇచ్చి ఉండకపోతే బాగుండేదన్నారు. ఆ లేఖ ద్వారా అర్చకుని పునర్ నియామకం జరిగితే నష్టం కలిగేదని, కానీ అలా జరగలేదన్నారు. భవిష్యత్తులో పొరపాట్లు జరగకుండా చూస్తామని, ఆలయాల పవిత్రతను కాపాడుతామని తెలిపారు.

రాయదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం గ్రామంలో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. వృద్ధురాలు మాదమ్మకు పింఛను నగదు అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూరూ. 16 కోట్లతో సీసీ రోడ్లు వేశామన్నారు. రూ. 7.68 కోట్లతో 384 గోకులం షెడ్లు లక్ష్యం కాగా 227 పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట డిఎల్‌డివో నాగేశ్వరరావు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, సోము, వీరేష్, నరేష్‌రెడ్డి, కుళ్లాయప్ప, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్వేతపద్మిని ఉన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కాలవ, ఛైర్మన్

ఈ పంట నమోదు గడువు పొడిగింపు : జెడిఎ

ప్రజాశక్తి-అనంతపురం

ఈ-పంట నమోదు గడువును ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగించిందని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 9,67, 081 సర్వే నెంబర్లకు గానూ 9,26, 517 సర్వే నంబర్లలో అంటే 95.8 శాతం ఈ పంట నమోదైందన్నారు. 19,01,538 ఎకరాల విస్తీర్ణానికి గానూ 17,40,276 ఎకరాల విస్తీర్ణం (92శాతం) లో నమోదైందన్నారు. పెండింగ్ ఉన్న సర్వే నంబర్లలో ఈ నెల 8వ తేదీలోపు ఈ పంట నమోదు చేయాలన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా 9 నుంచి 12వ తేదీ వరకూ తుది జాబితాను రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రదర్శిస్తామన్నారు. సామాజిక తనిఖీల్లో ఫిర్యాదులు అందితే వాటిని పరిష్కరించి 13వ తేదీ తుది ఈ పంట జాబితాను ప్రదర్శిస్తామన్నారు. కావున పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు.

గిట్టుబాటు ధరతో పత్తి కొనుగోలు

పెద్దవడుగూరు : ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని అప్పేచెర్ల గ్రామంలో వ్యవసాయ అధికారులు కొర్రపంట పొలంలో చేపట్టిన పంటకోత ప్రయోగా లను ఆమె పరిశీలించారు. అలాగే రైతులతో పత్తికొనుగోలు కేంద్రాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేం దుకు తాడిపత్రి, గుత్తి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. పత్తి పంట సాగుచేసిన ప్రతి రైతు కేంద్రాల్లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బయట దళారులను ఆశ్రయిస్తే నష్టపోవాల్సి వస్తుందని సిసిఐ ద్వారా గిట్టుబాటు ధరలు లభిస్తుందన్నారు. అనంతరం ఆమె రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట గుత్తి ఎడిఎ వెంకటరాముడు, ఎఇఒ సునీత, విఎఎ మహేంద్ర, విఆర్ఎ మద్దిలేటి ఉన్నారు.



విద్యార్థులతో సిఐ శేఖర్, పాఠశాల ఎజిఎం సుధాకర్‌రెడ్డి

'నారాయణ'లో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ఎన్‌పిఎల్(నారాయణ ప్రీమియర్ లీగ్) నారాయణ విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా అనంతపూర్ రూరల్ సిఐ శేఖర్, స్కూల్ ఎజిఎం సుధాకర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, చెస్, క్యారమ్స్ గేమ్స్ నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతి, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపల్ నీలిమ, హెచ్ఎం రాధానాయుడు, వైస్ ప్రిన్సిపల్ గౌసియా, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

దుర్గం రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు కంబాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న భారతి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆసుపత్రుల్లో సరైన సమయానికి రక్తం అందక అనేక మంది ఇబ్బందులు పడుతుంటారన్నారు. కొన్ని సందర్భాల్లో రక్తం సమయానికి అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరించి నిల్వ ఉంచడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. శిబిరంలో మొత్తం 61 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రవిచంద్ర, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ సుధాకర్, గౌని ప్రభాకర్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సామాజిక సర్వే

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం గుమ్మఘట్ట మండలంలోని 75-వీరాపురం గ్రామంలో సామాజిక సర్వే చేపట్టారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృత్తి, జీవనోపాధి, విద్య, ఇంట్లో వ్యక్తుల దురలవాట్లు, తదితర అంశాలను నమోదు చేశారు. ఈ సర్వే ద్వారా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు గ్రామీణుల సామాజిక స్థితిగతులు తెలుస్తాయని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ డి.నారాయణ తెలిపారు. అలాగే ఆర్‌డిటి పాఠశాలలో ఉపాధ్యాయుడు మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రాంగణం, పరిసరాలను శుభ్రం చేశారు. ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

ఎంబిబిఎస్ విద్యార్థికి సన్మానం

బెళుగుప్ప : స్థానిక శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన విద్యార్థి కెవి. మోక్షిత్‌సాయి తిరుపతిలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్‌లో ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించాడు. దీంతో శనివారం అదే పాఠశాలలో కరస్పాండెంట్ వి.శ్రీనివాసులు, హెచ్ఎం సుమ ఆధ్వర్యంలో విద్యార్థి కెబి.మోక్షిత్‌సాయి, విద్యార్థి తల్లిదండ్రులు కెబి.శివప్రసాద్, కెబి.శాంతిలను పూలమాలలు, శాలువాలతో సన్మానించి సత్కరించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకూ చదివిన మోక్షిత్‌సాయి నీట్‌లో 448 మార్కులు సాధించి ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించడం గర్వంగా ఉందన్నారు.

విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన బేరీల చరిత ఇంటర్‌లో బైపిసి గ్రూపులో 833 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆమె ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో సీటు సాధించింది. ఆమె కుటుంబ, ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్ రూ. 15వేలు, ఉపాధ్యాయుడు సాయిరాం రూ. 5వేలు (మొత్తం రూ. 20వేలు) ను శనివారం ఆమెకు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఏ విధమైన సహకారం కావాలన్న అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజునాథ్, నరహరి, పోలీస్ కానిస్టేబుల్ రాజేష్, ఆర్‌డిటి టీచర్ చైతన్య, హర్ష, ఉమా, సాయి, గంగన్న, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల ఈకేవైసీ ప్రక్రియ పరిశీలన

పుట్లూరు : మండల వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ కూలీల ఈకేవైసీ ప్రక్రియను శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంబాషా పరిశీలించారు. ఆయన మడుగుపల్లి, ఆరకటివేముల గ్రామ పంచాయతీల్లో పర్యటించి ఈకేవైసీఈ ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందో ఆరా తీశారు. ఆయన వెంట ఈసీ అంజన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజు, ఆదినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ పిబి.రామాంజనేయులు ఉన్నారు.

ఎస్ఆర్ఐటి అధ్యాపకులకు ప్రతిష్టాత్మక అవార్డులు

శింగనమల : బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(అటానమస్) కళాశాల అధ్యాపకులు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకుంటున్నట్లు ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ తెలిపారు. పరిశోధన, విద్య రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు బ్రెయినోవిజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ వారు భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్(బిఇఇఎ-2025) 5వ ఎడిషన్ పురస్కారాలను ప్రదానం చేశారు. అందులో తమ కళాశాల అధ్యాపకులు ఎం.రంజిత్‌రెడ్డికి సాధ్య ఆచార్య, జి.చిన్నపుల్లయ్యకు జ్యేష్ఠ ఆచార్య పురస్కారం ప్రదానం చేశారన్నారు. దేశవ్యాప్తంగా 3వేలకు పైగా నామినేషన్స్, వెయ్యికి పైగా విశ్వవిద్యాలయాలు, 400కు పైగా అవార్డు విభాగాలు ఉన్న ఈ పోటీల్లో వీరు ఈ గౌరవం దక్కించుకోవడం విశేషమని కొనియాడారు.



భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్ అందుకుంటున్న అధ్యాపకులు రంజిత్‌రెడ్డి, చిన్నపుల్లయ్య

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు.. బాలుడు మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

బైక్‌ను కారు ఢీకొనడంతో ఆరేళ్ల బాలుడు మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గయపడిన సంఘటన శనివారం మండలంలోని గోళ్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గోళ్ల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, కుమారుడు పునీత్‌రాజ్(6)తో కలిసి పాతచెరువు గ్రామం నుంచి బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీకొని పంట పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తండ్రికుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. పునీత్‌రాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు వెంటనే ప్రయివేటు వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో గాయపడిన వారిని స్థానికులే ప్రయివేటు వాహనాల్లో ఆసుపత్రులకు తరలించారు. ఇదే ప్రదేశంలో శుక్రవారం కూలీలతో వెళ్తున్న ఓ వాహనం బోల్తా పడటంతో శెట్టూరు గ్రామానికి చెందిన గొల్ల రాజప్ప మృతిచెందిన విషయం తెలిసిందే. అనంతపురం-కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో యాక్సిడెంట్ జోన్‌గా పరిగణించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

స్కూటీ డిక్కీ బద్దలుకొట్టి రూ. 6 లక్షలు చోరీ

ప్రజాశక్తి-గుత్తి

ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనం డిక్కీలో(సీటు కింద) ఉంచిన రూ. 6 లక్షల నగదు చోరీకి గురైన సంఘటన శనివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దవడుగూరు మండలం కాసేపల్లి గ్రామానికి చెందిన ఓబులేసురెడ్డి కొన్నేళ్లుగా గుత్తి పట్టణంలోని బిసి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో ఉన్న రూ. 6 లక్షల నగదు తీసుకుని తన ద్విచక్ర వాహనం(స్కూటీ) డిక్కీలో పెట్టుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జమ చేయడానికి బయల్దేరాడు. మార్గమధ్యలో గుత్తి ఆర్ఎస్‌లో అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా బైక్‌ను ఆపి స్వామి వారి దర్శనార్థం వెళ్లాడు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు స్కూటీ డిక్కీ బద్దలుకొట్టి, అందులో ఉంచిన రూ. 6 లక్షలు ఎత్తుకెళ్లారు. ఆలయంలో నుంచి బయటికి వచ్చిన ఓబులేసురెడ్డి స్కూటీ డిక్కీ తెరిచి ఉండడంతో పరిశీలించాడు. అందులో ఉంచిన రూ. 6 లక్షల నగదు కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ కె.సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆలయంలో విగ్రహం ధ్వంసం.. హుండీ చోరీ

ప్రజాశక్తి-నార్పల

స్థానిక మారెమ్మ గుడిలో దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు చోరీకి పాల్పడినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ పరిసరాల్లో మద్యం తాగి ఖాళీ మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు అక్కడే వదిలేశారన్నారు. అలాగే మారెమ్మ అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేయడంతో పాటు హుండీలోని నగదును ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. నార్పల ప్రజలు ఎంతో భక్తితో కొలిచే మారెమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం, చోరీకి పాల్పడడం బాధాకరం అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన ఆలయానికి వెళ్లి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవాలయాలపై దాడులు అధికమయ్యాయని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ ఏమైందో, పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందో తెలియడం లేదన్నారు. ఆయన వెంట ఎంపిపి నాగేశ్వరావు, ఫణీంద్ర, ఖాదర్ వలిఖాన్, బయన్న, రేవంత్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, గోపాల్, రవీంద్రగౌడ్ ఉన్నారు.

బైక్‌ను ఢీ కొన్న టిప్పర్.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-యాడికి

జాతీయ రహదారిపై మండలంలోని వేములపాడు క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన జయరాజు బైక్‌పై తాడిపత్రికి వెళ్తుండగా జాతీయరహదారిపై వేములపాడు క్రాస్ వద్ద టిప్పర్ ఢీ కొంది. ఈ ఘటనలో జయరాజు తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంకి తరలించారు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పోలీసులు శనివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లె కాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 10,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

శింగనమల : మండలంలో పెన్నా నది అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని నిదనవాడ, తరిమెల గ్రామాల సమీపం లో ఉన్న పెన్నా నదిలో కొందరు వ్యక్తులు పెద్దఎత్తున టిప్పర్లు, జెసిబిలు, హిటాచీలు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు నది వద్దకు వెళ్లి వారిని నిలదీశారు. అయినా వారు వినకుండా ఇసుకను తరలిస్తుండగా గ్రామస్తులు దారికి అడ్డంగా నిల్చొని వాహనాలు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్, తహశీల్దార్ శేషారెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్తులు అధికారులపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అధికారులు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యాడికి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. తాడిపత్రి మండలం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో స్థానిక మార్కెట్ వీధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

ఎస్కెయులో అన్ని విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి -అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(ఎస్కెయు) పిజి కళాశాలకు సంబంధించి అన్ని విభాగాల అకడమిక్ కన్సల్టెంట్స్ ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఉపకులపతి, రెక్టార్, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ కు వినతి పత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎస్కెయు పిజి కళాశాలకు సంబంధించి కొన్ని విభాగాల్లో ఖాళీలకు మాత్రమే ప్రకటన ఇవ్వడం తగదన్నారు. తక్షణమే అన్ని విభాగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్‌కుమార్, కుమ్మర శివ, సమర, ఆదినారాయణ, యశ్వంత్, రాజా, తదితరులు పాల్గొన్నారు.